'మిచాంగ్'తో రైతుల ఆందోళన

- అన్నదాత ఆశలపై నీళ్లు చల్లిన తుఫాన్
- దెబ్బతిన్న వరి, పత్తి, మిరప పంటలు

జూలూరుపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ ప్రభావంతో జూలూరుపాడు మండలంలో ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. సోమవారం రాత్రి నుంచి వర్షంతోపాటు, చల్లటి ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. చేతికి వచ్చిన వరి పంట, కల్లాల్లోని ధాన్యం, వరి కుప్పలు, కోత కోసి పొలంలో ఉండటంతో వాటిని తడిసిపోకుండా కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాల్లోని వరి పంట నేలకొరిగింది. పత్తి దూది పింజలు కారిపోతున్నాయి. ఇలాగే మరో రెండు, మూడు రోజులు తుపాను ఉంటే పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాల్వంచ: తుఫాన్ కారణంగా మండంలోని వరి పంట చాలా చోట్ల దెబ్బతిన్నది. సోమవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో పంటపొలాల్లో భారీగా నీళ్లు చేరాయి. కోత దశలో ఉండగా వర్షం కారణంగా వాలిపోతున్నాయి. రేపు కూడా వర్షం ఉంటే రైతులు కొంత మేర నష్టపోయే పరిస్థితి ఉంటుందని ఏఓ శంభోశంకర్ తెలిపారు.

ఇల్లెందురూరల్: ఆరుగాలం శ్రమించి పంట పండించి తీరా చేతికి వచ్చే సమయంలో వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న మిచాంగ్ తుపాన్ ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచి మండలంలో జల్లులు ప్రారంభమయ్యాయి.

తుపాన్ హెచ్చరికలతో మేల్కొన్న కొంతమంది రైతులు వరికోతలను త్వరగా ముగించుకొని ధాన్యాన్ని ఇళ్లకు చేర్చారు. మండలంలో అధికార గణాంకాల ప్రకారం నాలుగు వేల ఎకరాల్లో వరి సాగైంది. కానీ ఇప్పటి వరకు కేవలం వెయ్యి ఎకరాల్లో మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం తేలికపాటి వర్షాలకు తోడు గాలులు వీస్తుండటంతో వరిపంట చాలా వరకు నేలవాలింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతేకాకుండా పత్తి తీత కొనసాగుతోంది. మిర్చి పంట కూడా దెబ్బ తింటుందని అన్నదాతలు వాపోతున్నారు.

టేకులపల్లి: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మంగళవారం మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. చల్లటి వాతావరణం, కురుస్తున్న వర్షం కారణంగా వ్యాపారాలు కూడా సన్నగిల్లాయి. పలువురు వ్యాపారులు దుకాణాలు బంద్ చేసుకున్నారు. పలు గ్రామాల్లో వరి పంట నేలకు వాలింది. కల్లాల్లో వరి కోతలపై రైతులు టార్పాలిన్‌లు కప్పుకుని తడవకుండా కాపాడుకున్నారు.

పాల్వంచరూరల్: మిచాంగ్ తుపాన్‌తో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా అధికారులు జాప్యం చేయడంతో రైతులు కలవరం చెందుతున్నారు. వానాకాలం సాగుచేసిన వరిపంటను రైతులు కోసి విక్రయాల కోసం కల్లాల్లో రాసులు పోసి ఉంచారు. మంగళవారం నుంచి కురుస్తున్న తుపాన్‌కు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పాల్వంచరూరల్: బంధ్రుగొండలో నేలవాలిన వరి


టేకులపల్లి: కోయగూడెంలో వరి కుప్పపై టార్పాలిన్ కప్పుతున్న రైతు


సులానగర్‌లో నేల వాలిన వరి


జూలూరుపాడు: జడలచింతలో..


జూలూరుపాడులో...


వినోభానగర్‌లో కారిపోతున్న పత్తి

వరి నేలవాలుతోంది

మిచాంగ్ తుపాన్ కారణంగా వరి పంట నెలబారిందని, ఇప్పటికే మండలంలో నాలుగే వేల ఎకరాల్లో రైతులు వరిపంటను కొశారు. పంటపొలాల్లోని ధాన్యం నిల్వలు తడవకుండా రైతులు రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి పైఅధికారుల నుంచి ఉత్తర్వులు రాలేదన్నారు. – శంకర్, ఏఓ, పాల్వంచ

ధాన్యం కొనుగోళ్లు చేసేది ఎప్పుడో?

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో కురుస్తున్న తుపాన్ కారణంగా ధాన్యం తడిసి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మండలంలో 6 ధాన్యం కొనుగోలు కేంద్రాలను వరికోతలు ప్రారంభంలోనే ఏర్పాటు చేసే సంబంధిత శాఖల అధికారులు నేటికీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.


ఇల్లెందురూరల్: మాణిక్యారంలో...


ఆరబెట్టిన ధాన్యంపై పట్టాలు కప్పిన రైతులు


పాల్వంచరూరల్: సోములగూడెం వద్ద..

9 నుంచి భగవద్గీత కంఠస్థ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జ్ భాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన నగరస్థాయి, 10న జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయని, ఇప్పటికే జిల్లాలోని అన్ని పాఠశాలలకు సమాచారం అందించామని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పంట నష్టంపై సమగ్ర సర్వే చేపట్టాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంటౌన్: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేసేందుకు సమగ్ర సర్వే నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కోరారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వర్షాలతో వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు తీవ్రనష్టం జరిగిందున నష్టాన్ని గుర్తించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే, ఎస్పీ డాక్టర్ వినీత్‌ను కూడా సాబీర్‌పాషా కలిశారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించిన నేపథ్యాన ఎస్పీని సన్మానించారు.

ప్రపంచ తెలుగు సాహిత్య ఉత్సవాలకు ఆహ్వానం

పాల్వంచ: ఈనెల 16, 17 తేదీల్లో ఏలూరు జిల్లా తాడేపల్లిగూడెంలో జరగనున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు శ్రీశ్రీ కళా వేదిక ద్వారా పాల్వంచ మండలం రంగాపురానికి చెందిన బానోతు రవి నాయక్ ఆహ్వానం అందిందని మంగళవారం తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రవినాయక్ కళారంగంలో దూసుకపోతున్నారు. గతంలో అవార్డులు, నంది అవార్డులు అందుకున్నారు. ఉత్సవాలకు ఆహ్వానం అందడం పట్ల శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ ప్రతాప్, ప్రోగ్రాం కన్వీనర్ కొల్లి రమావతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌కు సన్మానం


వివేక్‌ను సన్మానిస్తున్న విజయ భాస్కర్

పాల్వంచ: చెన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ వివేక్‌ను పాల్వంచకు చెందిన విద్యుత్ ఉద్యోగుల ఉప కులాల సంఘం జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయ భాస్కర్ ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడలో వివేక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆరెపల్లి గోపికృష్ణ, ప్రవీణ్, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

టేకులపల్లి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నీరుడు అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వరి కోత విషయంలో వ్యవసాయ వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వరి కోతలు చేపట్టాలని, వీలైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదన్నారు. వరి కోత అయిన వారు ధాన్యపు రాశులు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి భద్రపరుచుకోవాలని తెలిపారు. వర్షం పడుతున్నందున పురుగుమందు పిచికారీ, రసాయనిక ఎరువులు వేయవద్దన్నారు. తడిసిన స్తంభాలను ముట్టుకోవద్దని, విద్యుత్ పరికరాలు, కరెంటు స్తంభాలను తాకడం, విద్యుత్ మోటార్లు ఆన్‌చేయడం వంటివి చేయకూడదని సూచించారు.

పదునెక్కిన కంకీకొడవలి


సీతంపేటలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

సుజాతనగర్: నియోజకవర్గంలోని సుజాతనగర్ మండలంలో సీపీఐ విజయదుందుభి మోగించింది. మండల వ్యాప్తంగా సీపీఐకి 9,328, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకట్రావుకు 5,372, బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు 3,185 ఓట్లు పోలయ్యాయి. మండల వ్యాప్తంగా 24 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. దాదాపు అన్ని పోలింగ్ స్టేషన్లలోనూ సీపీఐ హవా కొనసాగింది. రాఘవాపురంలో సీపీఐకి అత్యధికంగా 720 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 1173 ఓట్లు పోలవ్వగా.. అందులో 61 శాతం మంది ఓటర్లు సీపీఐకే మొగ్గు చూపటం విశేషం. అదేవిధంగా సీతంపేట బంజరలో సీపీఐకి 655, కారు గుర్తుకు 160 ఓట్లు, సింహం గుర్తుకు 267 ఓట్లు పడ్డాయి. వేపలగడ్డలో సింహం గుర్తుకు అత్యధికంగా 375 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ సీపీఐకి 326, బీఆర్‌ఎస్‌కు 232 ఓట్లు వచ్చాయి. ఇక మండలంలో బీఆర్‌ఎస్‌కు అత్యధికంగా కోమటపల్లిలో 258 ఓట్లు, అత్యల్పంగా జామ్లా తండాలో 23 ఓట్లు లభించాయి. నియోజకవర్గానికి సుపరిచితుడు న్యాయవాది బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేష్‌కు 201 ఓట్లు రాగా, బీసీ సామాజిక వర్గానికి చెందిన బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి లక్కినేని సురేంద్రరావుకు 135 ఓట్లు పోలయ్యాయి. వీరిద్దరి కంటే స్థానికేతరుడు, అలియన్స్ డెమోక్రటిక్ అభ్యర్థి తల్లాడ వెంకటేశ్వర్లుకు 219 ఓట్లు రావడం విశేషం.

సామాన్యులు శక్తివంతులుగా మారొచ్చు

కొత్తగూడెంఅర్బన్: కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, రాజకీయాలకు అతీతంగా శక్తివంతమైన ఆలోచనలు, నమ్మకాలు, అలవాట్లు, ప్రవర్తనలతో ఉన్న సామాన్యులు కూడా శక్తివంతంగా మారవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్, సైకాలజిస్ట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. మంగళవారం ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్ అనే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ మేధావులు తేల్చిన గొప్ప పరిశోధన ద్వారా ఒక మనిషి తన ఆలోచనలను, తాను నియంత్రించుకోగలిగితే ఉన్నతమైన స్థానంలోకి వెళ్తారని తెలిపారు. అనేక మంది సామాన్య కుటుంబాలలో జన్మించిన వ్యక్తులు, అత్యుత్తమ వ్యక్తిత్వంతో ప్రపంచస్థాయి నాయకత్వంలోకి వెళ్లిన అనేక ఉదాహరణలను వివరించారు. ప్రతీఒక్కరూ ఈ సమాజం మారాలి, మేధావులు మారాలి, తల్లిదండ్రులు మారాలి అని అనుకోవడం బదులు, వారే మారి చూపించాల్సిన అవసరముందన్నారు. మనం మారడం ద్వారా, మన కుటుంబాలు, గ్రామస్థాయి నుంచి దేశ స్థాయిలో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో మెజీషియన్ ఆదినారాయణ, డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాస్, సింగరేణి ఏజీఎం, డీజీఎంలు గోనే శ్రీకాంత్, ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, సుగుణరావు, మొక్కల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇకనైనా సింగరేణిలో బదిలీలు జరిగేనా?


సింగరేణి ప్రధాన కార్యాలయం ముఖ ద్వారం

సింగరేణి(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణిలో అక్టోబర్ 10 నుంచి యాజమాన్యం ఎన్నికల కోడ్‌ను అమలు చేసింది. ఈ కోడ్ మంగళవారంతో ముగిసింది. వాస్తవానికి ఈ కోడ్ గతంలో ఎన్నడూ ఇంత పకడ్బందీగా అమలు చేయని యాజమాన్యం ఈసారి మాత్రం రాష్ట్ర ప్రభుత్వ మెప్పు కోసం అమలు చేసింది. దీంతో కార్మికుల బదిలీలు, పదోన్నతుల ఉత్తర్వులు నిలిచిపోయాయి. అంతేకాకుండా ఇటీవల నియామక ప్రక్రియ చేపట్టిన క్లరికల్ నియామక ఉత్తర్వులను కూడా అభ్యర్థులకు పంపించకుండా నిలిచిపోయాయి. అదేవిధంగా ప్రతీనెల క్రమం తప్పకుండా జరగాల్సిన మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో సుమారు 400 మంది కార్మిక కుటుంబాలకు జరగాల్సిన ఇన్‌వాలిడేషన్ నిలిచిపోయింది. దీంతో కొంతమంది వయోపరిమితి దాటే ప్రమాదం ఉన్నందున, యాజమాన్యం దానిని సడలించాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఈనెల 23న జరగనున్న సింగరేణి డే వేడుకలకు సంబంధించిన బడ్జెట్‌ను మాత్రం 20 రోజుల క్రితమే యాజమాన్యం విడుదల చేసినట్లు సమాచారం. అంతే కాకుండా ఈ కోడ్ అమల్లో ఉన్నప్పటికీ సింగరేణి ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాలు, నాణ్యత పక్షోత్సవాలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం, ఉత్పత్తి రివ్యూ సమావేశం, ఏరియాలలో డైరెక్టర్ల పర్యటన, పర్యవేక్షణ వంటి కార్యక్రమాలను మాత్రం యధావిధిగా కొనసాగించింది. అంతర్గత కార్యకలాపాలు చేస్తున్న సింగరేణి కార్మికుల విషయంలో కోడ్ నిబంధనలు పాటించటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక కార్యకలాపాలు నిర్వహించిన యాజమాన్యం కార్మికులకు సంబంధించిన పలు అంశాలను కోడ్ పేరుతో నిలిపివేయడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాతీర్పును గౌరవిస్తాం


మాట్లాడుతున్న కాపు సీతాలక్ష్మి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజలు మార్పును కోరుకున్నారని, ఎన్నికలలో వారు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు అన్నారు. జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వనమా వెంకటేశ్వరరావు ఓటమితో నిరాశ చెందామన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తాము పనిచేస్తామని, ఓటమి వల్ల రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు ఉన్నపుడు పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూశారని, అదే తరహాలో కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల మీద మూడు రోజులుగా అసత్య వార్తలు వస్తున్నాయని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. వేల్పుల దామోదర్, రజాక్, యూసుఫ్, సుందర్‌రాజు, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని కిష్టారం ఓసీలో పనిచేసే కార్మికులు మంగళవారం ఐఎన్‌టీయూసీలో భారీగా చేరారు. వారికి నాయకులు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, వైస్ ప్రెసిడెంట్ ఆలబ్రర్ట్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించిన కార్మికులకు, కార్మిక కుటుంబాలకు, కాంట్రాక్ట్ కార్మికులకు పేరుపేరున ధన్యావాదాలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ సంఘం నాటి నుంచి నేటి వరకు కార్మిక వర్గం వెన్నంటి ఉండి, కార్మికుల కష్టాసుఖాల్లో భాగమై, కార్మికవర్గం కోసం ఎనలేని పోరాటాలు చేసిందన్నారు. కార్మికుల ఆదరణతో సంపూర్ణ మద్దతుతో ఐఎన్‌టీయూసీ మరింత ముందుకెళ్తుందన్నారు. ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గడియారం గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు రావి నాగేశ్వరరావు, మంతెన బాలకృష్ణ, ఎస్.రామారావు, జేవీఆర్‌ఓసీ పిట్ సెక్రటరీ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రకటనతో హర్షం

ఇల్లెందురూరల్: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. పలు గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్ల మీదకు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మిఠాయి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిట్టిబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, జెమినీ, కిన్నెర నర్సయ్య, పూనెం సురేందర్, మండల రాము, ముక్తి కృష్ణ, పాయం కృష్ణప్రసాద్, ఎట్టి హరికృష్ణ, ధనసరి రాజు, తాటి రాంబాబు, కుమ్సోత్ రాము, తాటి భిక్షం పాల్గొన్నారు.


టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

నత్తనడకన రోడ్డు నిర్మాణం

- పెట్రాంచెలక స్టేజీ – మర్రిగూడెం మధ్య అదుపు తప్పి పడిపోతున్న వాహనదారులు
- దుమ్ము ధూళితో జనం అవస్థలు.
- దెబ్బతింటున్న పంటలు

టేకులపల్లి: టేకులపల్లి మండలం పెట్రాంచెలక స్టేజీ నుంచి మర్రిగూడెం వరకు బీటీ రోడ్డు పనులు నత్తనడక సాగుతున్నాయి. దీంతో ఈ మార్గంలోని ప్రయాణిలు ఇబ్బందులు పడుతున్నారు. పెట్రాంచెలక స్టేజీ నుంచి ఇల్లెందు మండలం మర్రిగూడెం వరకు మొత్తం 17కిలోమీటర్లు ఉన్న సింగిల్ రోడ్డుని డబుల్ రోడ్డుగా మార్చేందుకు 2018–19 ఆర్థిక సంవత్సరంలో నక్సల్స్ ప్రభావిత నిధులు (ఎల్‌డబ్ల్యూఎస్) రూ.14.50 కోట్లు మంజూరయ్యాయి. సింగిల్ రోడ్డును పగులగొట్టి పనులు కూడా ప్రారంభించారు. గ్రామాల పరిధిలో ఎనిమిది కిలోమీటర్ల వరకు రెండులేన్ల బీటీ రోడ్డు నిర్మాణం నాలుగేళ్ల క్రితమే పూర్తయింది. టేకులపల్లి మండలం పెట్రాంచెలక స్టేజీ నుంచి కారేపల్లి తండా వరకు మూడు కిలోమీటర్లు, రామకృష్ణాపురం నుంచి మర్రిగూడెం (ఇల్లెందు మండలం) వరకు ఆరు కిలోమీటర్లు మొత్తం తొమ్మిది కిలోమీటర్ల వరకు అటవీ శాఖ కొర్రీలు పెట్టడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇదే మార్గం ద్వారా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు తదితరులు రాకపోకలు సాగిస్తుంటారు. టేకులపల్లి నుంచి ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి మండలాలకు వెళ్లేందుకు ఈ మార్గం ఎంతగానో ఉపయోగపడుతుంది. నాలుగు మండలాలకు ఎంతో కీలకమైన రహదారి నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతరం చెప్పడం గమనార్హం. పెట్రాంచెలక స్టేజీ నుంచి మర్రిగూడెం వరకు తొమ్మిది కిలోమీటర్ల పరిధి అటవీ ప్రాంతంలో ఉందని రోడ్డు నిర్మాణాన్ని ఫారెస్టు శాఖ అడ్డుకున్న విషయం తెలిసిందే. ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు తొమ్మిది కిలోమీటర్ల వరకు డబుల్ రోడ్ కాకుండా సింగిల్ రోడ్డు నిర్మించుకునేందుకు అటవీ శాఖ అనుమతిచ్చింది. దీంతో ఎట్టకేలకు ఆగస్టులో బీటీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. మళ్లీ రోడ్డును తవ్వి కంకర, సిమెంట్ మిక్సింగ్ వేశారు. బీటీ వేయడం ప్రారంభం కాకపోవడంతో తేలిన కంకర, దుమ్ము ధూళితో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పలువురు అదుపు తప్పి కింద పడటంతో గాయాలైన సంఘటనలు ఉన్నాయి. తొమ్మిది కిలోమీటర్ల మేర మిర్చి, పత్తి, వరి, కంది, మొక్కజొన్న పంటలు దుమ్ము ధూళితో పనిరాకుండా పోయాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం, నిర్లక్ష్యం కారణంగా ప్రజలే కాకుండా రైతులు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డుని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దుమ్ము ధూళితో దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలు


పెట్రాంచెలక స్టేజీ - కారేపల్లి తండా రోడ్డు దుస్థితి

రాందాస్ నాయక్‌దే అత్యధిక మెజార్టీ



జూలూరుపాడు: నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో ఏర్పడిన వైరా నియోజకవర్గంలో తాజా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అత్యధిక మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారు. వైరా నియోజకవర్గం ఏర్పడిన తరువాత నాలుగోసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాందాస్ నాయక్‌కు 33,045 ఓట్ల మెజార్టీ వచ్చింది. 2018లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన లావుడ్యా రాములు నాయక్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌పై 2,013 అత్యల్ప ఓట్ల మెజార్టీతో గెలిచారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి మహాకూటమి తరపున పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి బానోత్ చంద్రావతి, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ భూక్యా రామచంద్ర నాయక్‌పై 13,626 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొన్నటి వరకు ఈ మెజార్టీయే వైరా నియోజవర్గంలో అత్యధికంగా ఉంది. 2014లో ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బానోత్ మదన్‌లాల్ టీడీపీ అభ్యర్థి బానోత్ బాలాజీ నాయక్‌పై 10,583 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గడిచిన నవంబర్ 30న జరిగిన వైరా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్ లాల్‌పై పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్‌కు వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల, వైరా, ఏన్కూరు, కారేపల్లి, జూలూరుపాడు మండలాల్లో అత్యధిక మెజార్టీ రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌కు ఏ ఒక్క మండలంలో మెజార్టీ లభించకపోవడం విశేషం. కాంగ్రెస్‌కు కొణిజర్ల మండలంలో అత్యధికంగా 9,469 ఓట్లు, వైరాలో 8,523, ఏన్కూరులో 5,950, కారేపల్లిలో 5,530, జూలూరుపాడులో 2,467 ఓట్లతో అత్యల్ప మెజార్టీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్ నాయక్‌కు 1,104 ఓట్ల ఆధిక్యత వచ్చింది. కొణిజర్ల మండలంలో కాంగ్రెస్‌కు 24,617, బీఆర్‌ఎస్‌కు 15,148 ఓట్లు వచ్చాయి. వైరాలో కాంగ్రెస్‌కు 21,089, బీఆర్‌ఎస్‌కు 12,566 ఓట్లు, ఏన్కూరులో కాంగ్రెస్‌కు 14,155, బీఆర్‌ఎస్‌కు 8,205 ఓట్లు, కారేపల్లిలో కాంగ్రెస్‌కు 20,283, బీఆర్‌ఎస్‌కు 14,753 ఓట్లు, జూలూరుపాడు మండలంలో కాంగ్రెస్‌కు 12,253, బీఆర్‌ఎస్‌కు 9,786 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్ నాయక్‌కు పోస్టల్ బ్యాలెట్ 1,516 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌కు 412 మాత్రమే వచ్చాయి.

సీపీఎంకు 4,439 ఓట్లు... వైరా నియోజకవర్గంలో ఒంటరిగా పోటీ చేసిన సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రంకు 4,439 ఓట్లు మాత్రమే వచ్చాయి. సీపీఎంకు అత్యధికంగా కొణిజర్ల మండలంలో 1,447 ఓట్లు రాగా, అత్యల్పంగా జూలూరుపాడు మండలంలో కేవలం 482 ఓట్లు మాత్రమే వచ్చాయి. వైరాలో 1,192 ఓట్లు, కారేపల్లిలో 781 ఓట్లు, ఏన్కూరు మండలంలో 499 ఓట్లు లభించాయి. అదేవిధంగా 38 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి.